క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సెమీ క్రిస్మస్ వేడుకలు



వేమూరు: క్రిస్మస్ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కోవడం జరుగుతుందని గ్రేస్ పౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేం రాజు అన్నారు. మండల కేంద్రంలోని బేతేలు పురం ఒకటో వార్డులో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేస్ ఫౌండేషన్ తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేసి, అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టరు సి.లాజరస్, పచ్చిగళ్ల అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అభయప్రధాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ కార్తికమాసం రెండవ ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాదికారి జి.నరసింహ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వితలేశ్వరుని లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత హేమ వితలేశ్వర స్వామి వారి దేవాలయంలో లక్ష బిల్వార్చన ఆదివారం నిర్వహించారు. ప్రభాత సంకీర్తన అనంతరం మారేడు దళాలను భజన సమాజం ఆధ్వర్యంలో సంకీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. కుంకుమార్చన, సుబ్రహ్మణ్యేశ్వర, నందీశ్వర స్వామికి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలలో దంపతులు పాల్గొన్నారు. అర్చకులు మురికిపూడి దుర్గా ప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్వామి సేవా సమాజం పర్యవేక్షించింది.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



భట్టిప్రోలు: వేదాంత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం భట్టిప్రోలు రమా గుప్తా కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా కిడ్నీ, గుండె, ఎముకలు, షుగర్ వ్యాధి నిపుణులు చింతా రామకృష్ణ, ఎ. తిరుమల నరేష్, శ్రీనివాస్ పోలిశెట్టి, మంజుల శ్రీరామ్, నలిగల దివ్యలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి ప్రారంభించారు. శిబిరంలో 350 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, దారా చెన్నయ్య, మద్దుల రామ ప్రకాష్, రాజా, హాస్పిటల్స్ మేనేజర్ ప్రవీణ్ కళాధర్ పర్యవేక్షించారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

భట్టిప్రోలు: కార్మికుల హక్కుల కాలరాస్తూ తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే కార్మిక, రైతాంగ మహా ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. ముఠ్ఠర్జీ, మేస్త్రీలు కర్రా రవిబాబు, తాతా ఉమామహేశ్వరరావు, విజయరావు, పైడయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



రేపల్లె పట్టణ సర్కిల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు సిబ్బంది



వేమూరు ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రేపల్లె: రాజ్యాంగ అమలుతోనే భారతావనికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించిందని, అటువంటి రాజ్యాంగాన్ని గౌరవించుకుంటూ రాజ్యాంగ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ సీఐ నజీర్‌బేగ్ అన్నారు. 74వ రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం నాటికి సమాజంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో నిర్మించిన రాజ్యాంగంతోనే సమసమాజాభివృద్ధి నిర్మాణం సాధ్యమైందన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రావతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం, సీపీఐ, జైభీమ్ భారత్‌పార్టీలతో పాటుపలు ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, తహసీల్దార్ కార్యాలయంలోనూ వేడుకలు నిర్వహించారు.

ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం

భట్టిప్రోలు: రాజ్యాంగం కల్పించిన హక్కులను చిత్తశుద్ధితో అమలు చేయాలని జై భీమ్ రావ్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది దోవా రమేష్ రామ్‌జీ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకుని పలు గ్రామాల్లో రాజ్యాంగ చైతన్య యాత్ర నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, వేమూరు నియోజకవర్గ నాయకుడు జడా రవీంద్రబాబు, అంబేడ్కర్ యూత్ నాయకుడు పంతగాని నాగేశ్వరరావు, వినోద్, కర్రా బాబురావు, బుస్సా శ్రీనివాసరావు, నీలా వాసు బాబు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి పూలమాలలు వేశారు. దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవ ర్యాలీ

వేమూరు: మండల కేంద్రంలో భారత రాజ్యాంగం ఆమెద దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారి -2 రోజ్ ల్యాండ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పొందుపరిచిన రాజ్యాంగంలో దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందించిన రాజ్యాంగం ఆమెదించి 74 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయలు పద్మజా, దొప్పలపూడి జ్యోతిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అద్దేపల్లిలో జైభీమ్ రావ్ పార్టీ నాయకులు



బహుమతులు ప్రదానం చేస్తున్న డీన్ డాక్టరు హరిబాబు

రాజ్యంగ ప్రతిష్టను కాపాడాలి

బాపట్లటౌన్: రాజ్యాంగ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల డీఎస్పీ టి. వెంకటేశులు అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 74 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం నవంబర్ 26 అమలులోకి వచ్చి 74 సంవత్సరాలు గడిచిందన్నారు. పరాయి పాలన నుంచి విముక్తి పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య లిఖిత రాజ్యాంగం కలిగి ఉన్న దేశంగా మనకు ఇది ఎంతో గర్వకారణమన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్‌శాఖ పాత్ర ముఖ్యమైనదని, అందులో భాగంగా పోలీసులు సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పౌరుల ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో బాధ్యతాయుతమైన సేవలు అందించాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రాజ్యాంగబద్ధంగా నడవాలని భారత రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, వేల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మథరావు, హోమ్ గార్డ్ ఆర్.ఐ ఎల్. గోపీనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి డీఎస్పీ వెంకటేశులు, సిబ్బంది నివాళి



అంబేడ్కర్ చిత్ర పటానికి డీపీఓ నివాళి

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శం

కర్లపాలెం: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శణీయమని బాపట్ల డీపీవో, కర్లపాలెం ఎంపీడీవో దాసరి రాంబాబు తెలిపారు. రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి డీపీవో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటాలకు స్థానిక సర్పంచ్‌లు ఎంపీటీసీలు నివాళులర్పించారు.

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో..

బాపట్ల: డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో రాజ్యాంగ అమోద దినోత్సవాలను ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ బి.హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్ కుమార్, డాక్టర్ జి.వీరప్రసాద్ పాల్గొన్నారు.

కార్తిక పౌర్ణమి వేడుకలకు ఆలయాల ముస్తాబు



కార్తిక పౌర్ణమి వేడుకలకు మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం సిద్ధం



కార్తిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

రేపల్లె రూరల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలుశైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో ఏర్పాట్లును వివిధ శాఖల అధికారులు ఆదివారం పరిశీలించారు. కృష్ణనది ఒడ్డున వెలసిన ముక్తేశ్వర స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసేందుకు అవకాశం ఉన్నందున ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ మల్లికార్జునరావు తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పించటం జరిగిందన్నారు. కృష్ణానదిలో భక్తులు లోతట్టు ప్రాంతానికి వెళ్లకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మహిళలు స్నానమాచరించి బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ఆవరణంలో పూజలు చేసుకునేందుకు పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టటంతో పాటు ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం ప్రత్యేక వలంటీర్లతో ఆలయ పరిసరాలను పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. అలాగే.. అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయం, చోడాయపాలెంలో చౌడేశ్వరస్వామి, రైలుపేటలో స్వయంభూ రామలింగేశ్వరస్వామి, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి, ఓల్డ్‌టౌన్‌లోని ఉమామహేశ్వర స్వామి, పెనుమూడి శివాలయంలో ఏర్పాట్లను ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పూర్తి చేశారు.

శివాలయాల్లో కార్తిక పౌర్ణమి పూజలు

భట్టిప్రోలు: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గంగాపార్వతీ సమేత వితలేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి, స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. శివ సన్నిధిలో ఈ మాసమంతా దీపారాధన అత్యంత శ్రేష్టమైనదని వేద బ్రాహ్మణులు దండిభొట్ల కనక సుందరశర్మ తెలిపారు.

రాజరాజ నరేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరీ దేవి సమేత రాజరాజ నరేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. రాత్రి దేవాలయంలో జ్వాలా తోరణం, స్వామి వార్ల గ్రామోత్సవం కావించారు. గౌరిగపూడికి చెందిన గరికపాటి వంశస్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినిత్యం స్వామి వార్లకు సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ తెలిపారు. దేవస్థానక కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేక సాంబశివరావు పర్యవేక్షించారు. అలాగే గ్రామ దేవత గోగులమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దీవి గోపి పూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను, గ్రామ దేవతను దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

దృష్టి లోపం నివారణకు వైద్య శిబిరాలు

బాపట్ల అర్బన్: దృష్టి లోపం నివారణకు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కమజన సేవా సమితి కల్యాణ మండపంలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ముప్పలనేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆర్థిక స్థోమత లేని వెనుకబడిన వర్గాల ప్రజానీకం నేత్ర సమస్యల పరిష్కారానికి కమ్మ జన సేవా సమితి నేత్ర వైద్య శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టిందన్నారు. శంకర కంటి ఆసుపత్రిలో శుక్లం ఆపరేషన్లకు శస్త్ర చికిత్స అందించనున్నట్లు తెలిపారు. యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రామనేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మానం భద్రయ్య, కోశాధికారి ఏలూరి హరి బాబు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైభవంగా అఖండ దీపోత్సవం

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణ, మండలంలోని వివిధ దేవాలయాలలో కార్తిక దీపోత్సవ కార్యక్రమాలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో గుర్రం మణికంఠ-లక్ష్మీ ప్రసన్న దంపతులు లక్ష దీపోత్సవం వైభవంగా చేశారు. ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, రైలుపేటలోని స్వయంభూరామలింగేశ్వరస్వామి ఆలయం, ఓల్డ్‌టౌన్‌లోని ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఆయాదేవాలయాలు భక్తులకు కళకళలాడాయి.



కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

'విశ్వశాంతి' ఉపాధ్యాయుడికి అవార్డు ప్రదానం

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ (ఏపీ పీయూఎస్ఎంఏ) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చింతల రాజబాబు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీపీయూఎస్ఎంఏ అధ్యక్షులు బి. పోతురెడ్డి చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నారు. రాజబాబును హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.

లక్ష దీపోత్సవం

కర్లపాలెం: పవిత్రమైన కార్తీకమాసంను పురస్కరించుకుని పెదపులుగువారిపాలెంలో భక్తులు లక్ష దీపోత్సవాల పూజలు చేశారు. గ్రామంలోని వీర్లంకమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 జంటలతో కార్తీక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు లక్ష వత్తుల దీపాలను వెలిగించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

మరుదొడ్లు నిర్మాణానికి భూమి పూజ

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆదివారం నిర్మాణ పనులను విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ముఖ్య అతిథి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి మాట్లాడుతూ గ్రామంలోని ముఖ్య కూడళ్లల్లో, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, శ్మశాన వాటికలు, రహదారుల వెంట మొక్కలు నాటి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎఫ్ఏ ప్రధాన కార్యదర్శి కొన్నిపాటి సత్యన్నారాయణ, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు గోలి శ్రీనివాసరావు, పీజీ అరుణ్‌శాస్త్రి, కుక్కల భూషణరావు, దారా చెన్నయ్య, వాకా అంకబాబు, మోర్ల కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, బీఎఫ్ఏ నిర్వాహకులు దొంతు ఆదినారాయణ, వంగర బాబూజీ, బూర్లె కిరణ్‌కుమార్, వంగర ప్రసాద్, భారతుల శ్రీధర్, ద్వారకానాథ్, పసుపులేటి శివరామ ప్రసాద్, రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు మస్తాన్ పాల్గొన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో శంకుస్థాపన చేస్తున్న బీఎఫ్ఏ నిర్వాహకులు

చేనేతకు కోటయ్య సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు



ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళి

రేపల్లె: చేనేత పరిశ్రమ రక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేసిన చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్యకు ప్రతి చేనేత కార్మికుడు రుణపడి ఉంటారని రేపల్లె చేనేత సహకార సంఘ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. ప్రగడ కోటయ్య 28వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రేపల్లె చేనేత సహకార సంఘ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నాడు స్వాతంత్ర పోరాటంలో తన వంతు సేవలు అందించారన్నారు. చేనేత కార్మికులకు నూలు ధల స్థిరీకరణకు, వస్త్రాలకు గిట్టుబాటు ధర లభించేలా అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. పలుమార్లు శాసనసభ్యునిగా, శాసనమండలి సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా అనేక పదవులు చేపట్టి చేనేత కార్మికుల కోసం చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి నూలు మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏజీపీ జొన్నాదుల శ్రీనాగరాజు, పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, చేనేత సహకార సంఘం నాయకులు కొతరపు నాంచారయ్య, రామ్మోహనరావు, రాఘవయ్య, శోభనబాబు, రాంబాబు, భాస్కరరావు, డాక్టర్ ఏవీ సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత బాంధవుడు ప్రగడ కోటయ్య

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్‌లో చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు దివంగత రాజ్యసభసభ్యులు , చేనేత నాయకులు ప్రగడ కోటయ్య ఎనలేని కృషి చేశారని వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి పేర్కొన్నారు. ప్రగడ కోటయ్య 28వ వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలులోని రథం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆదివారం పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఒకప్పుడు ఇసుకపర్రలతో కునారిల్లిన చీరాల, పేరాల ప్రాంతాల అభివృద్ధిలో కోటయ్య పాత్ర ఎంతో ఉందని వివరించారు. కార్యక్రమంలో చేనేత నాయకులు, సంఘీయులు పాల్గొన్నారు.

శాంతి రథం అందజేత

బాపట్ల: పట్టణంలో అవసరమైన శాంతి రథం, బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందించేందుకు మానవత సంస్థ వారు ముందుకు రావడం గొప్ప విషయం అని గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు .ఆదివారం ఎకో హౌస్ లో జరిగిన కార్యక్రమంలో బాడీ ఫ్రీజర్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే శాంతిరథాన్ని కొమ్మినేని కమల కుమారి ప్రారంభించారు. ఈ సేవలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉచితంగా అందుబాటులో ఉంటాయని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మానవత సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బి.శరత్ బోస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి మానవత సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. న్యాయవాది కామేపల్లి కృషిబాబు మాట్లాడుతూ బాపట్లలో మానవత సంస్థ తరపున ఉచిత సేవలు అందించడం శుభ పరిణామం అని చెప్పారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ వి.ఎస్ రఘురాం, ప్రాణాధార ట్రస్టు చైర్మన్ కె.పుండరీకాక్షయ్య, మానవత సంస్థ సంయుక్త కార్యదర్శి ప్రసన్నాంజనేయులు, ముప్పలనేని లక్ష్మీ, గోరంట్ల శాంతారాం , డాక్టర్ శ్రీనివాస్, కేశవులు, గురజాల శ్రీనివాసరావు, ఎల్.వెంకట్రావు ప్రసంగించారు. మానవత సంస్థ బాధ్యులు కొమ్మినేని శ్రీనివాసరావు ,మానం అప్పారావు, జీవి పాల్గొన్నారు.



శాంతి రథంని ప్రారంభిస్తున్న దాతలు

రజకులను ఆదుకోవాలి

బాపట్ల: దమాషా లెక్కల ప్రకారం రజకులకు కల్పించాల్సిన సదుపాయాలపై ప్రభుత్వాలు స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. రజక సమస్యల పరిష్కారం కోరుతూ రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీ ఎదురు చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో జరుగుతున్న రజక ఆత్మగౌరవ సభకు బాపట్ల నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో రజకులు ఆదివారం తరలి వెళ్లారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి చీలు రోడ్డు వరకు వాహనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు అంగలకుదురు నటరాజ్ మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణం అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన రజకులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు నాగరాజు, కె. అంజి, పాలకేటి సుబ్బారావు, పేరాల నాగరాజు,మద్దారపు సందీప్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గీత, బ్రహ్మానందం, ఉప్పిరెట్ల గోపి, చేజర్ల రాంబాబు, శ్రీనివాసరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరు

బాపట్ల: ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరులా ఉండాలని ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండలురెడ్డి పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం మునిసిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి పాల్గొన్ని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో మందిని ఎన్‌సీసీ వైపు నడిపించిన కత్తి శ్రీనివాసరావు మాస్టర్ సేవలను గొప్పవిగా ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణతో ముందుకుపోయి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా నిర్వహించిన క్రీడాల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కత్తి శ్రీనివాసరావు, కందుల సీతారాం, ఎర్ర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అల్లూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పిట్టలవానిపాలెం: అల్లూరు గ్రామంలో ఈ నెల 28న మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. అల్లూరు సచివాలయ పరిధిలోని అలకాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ అనంతరం అల్లూరు గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు లబ్దిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించనున్నట్లు తెలిపారు . బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొంటారని పేర్కొన్నారు.